
క్లుప్తంగా

కారు.. మోపెడ్ ఢీ

● ఒకరికి తీవ్ర గాయాలు



దెబ్బతిన్న కారు ముందు భాగం

మేదరమెట్ల: కారు.. టీవీఎస్ ఢీ కొన్న సంఘటన కొరిశపాడు మండలం వెంకటాపురం క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం జరిగింది. ఈ ప్రమాదంలో మోపెడ్ పై వెళుతున్న వ్యక్తి కాలుకు తీవ్ర గాయం అయింది. గుంటూరు నుంచి బెంగళూరుకు వెళుతున్న కారు ఆదే మార్గంలో వెళుతున్న టీవీఎస్ మోపెడ్‌ను వెనుక నుంచి బలంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో బల్లికురవ మండలం ఇసుకదర్శి గ్రామానికి చెందిన కొవ్వూరి వెంకటేశ్వర్లు కాలికి తీవ్రగాయం కాగా 108 వాహనంలో ఒంగోలు తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శింగరకొండ దేవస్థాన అర్చకుడికి ఉగాది పురస్కారం



ఉగాది పురస్కారం అందుకున్న అర్చకుడిని అభినందిస్తున్న ఏసీ తిమ్మనాయుడు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ దేవస్థానంలో అర్చకుడు వేలమూరి శ్రీరామచంద్ర మూర్తి ఆదివారం కలెక్టర్ చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్ర మూర్తిని దేవస్థాన ఏసీ యం. తిమ్మ నాయుడు అభినందించారు.

గేటుతో గుబులు



రైలు గేటు కారణంగా నిలిచి పోతున్న వాహనాలు



రైలు గేటు మూయడంతో భారీగా నిలిచిన వాహనాలు

● చినగంజాంలో ప్రజల అవస్థలు
● గేటు పడితే భారీగా నిలిచిపోతున్న వాహనాలు

చినగంజాం: రైలు రాకపోకల సమయంలో రైలు గేట్లు వేస్తే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు అరగంటకుపైగా వాహనాలు గేట్లకు రెండు వైపులా నిలిచి పోతున్నాయి. దాంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. చినగంజాం మండలంలో చినగంజాం, మున్నం వారిపాలెం, సోపిరాల, కడవకుదురు, రాజుబంగారుపాలెం, పెదగంజాం ప్రజలు ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేయాలంటే తప్పనిసరిగా రైల్వే లైను దాటి వెళ్ళాల్సిందే. అయితే గేటు పడితే చాలు వాహనాలు బారులు తీరి అరగంటకు పైగా వేచి ఉండాల్సిన పరిస్థితి తలెత్తడంతో కొందరు అత్యవసర పరిస్థితులలో ప్రత్యామ్నాయ మార్గాలను వెదుక్కుంటున్నారు. ప్రస్తుతం వేసవి కాలం సమీపిస్తుండటంతో ఎండలు తీవ్రంగా ఉండటంతో గేటు కోసం వేచి ఉండాల్సి రావడంతో ద్విచక్ర వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. చినగంజాం మండలంలో ఎక్కువగా చినగంజాం ప్రధాన రైల్వే గేటు ద్వారా రాకపోకలుసాగిస్తుంటారు. నిత్యం వందల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, కార్లు, భారీ వాహనాలు, ఉప్పు, ఇసుక లోడుతో వెళ్ళే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాంటి పరిస్థితుల్లో అరగంటకు పైగా గేట్లు మూసి ఉండటంతో భారీగా గేటుకు రెండు వైపులా వాహనాలు నిలిచి పోతున్నాయి. దీంతో పాటు పాదచారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఈ గేటు ద్వారా మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలతో పాటు నాగులుప్పలపాడు మండలం కనపర్తి, అమ్మనబ్రోలు గ్రామాలకు చెందిన వాహనదారులు సైతం రావాల్సి రావడంతో తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. రైలు గేటు ఒక్కసారిగా తెరవడంతో వాహనాలు ఢీ కొని ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి.

మూడో లైనుతో పెరిగిన రైళ్ల రాకపోకలు

రైల్వే ట్రాక్‌కు సంబంధించి ఇటీవల మూడోలైను రావడం, రైళ్ళు రాకపోకలు ఎక్కువగా పెరిగి పోవడంతో గేటు వేస్తే ఎక్కువ సేపు ప్రజలు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రైల్వే స్టేషన్ దగ్గరగా ఉండటంతో మున్నం వారిపాలెం, చినగంజాం, సోపిరాల రైల్వే గేటుల వద్ద ట్రాఫిక్ తీవ్రంగా పెరిగి పోతోంది. అంతేకాకుండా రెండు రైల్వే లైనులున్న సమయంలో రైలు ఎటువైపు వస్తుందో పాదచారులకు అర్థమయ్యేది. అటువంటిది మూడో లైను వేసిన తరువాత ఒకే ట్రాక్‌పై రెండు వైపులను నుంచి రైళ్ళు నడుపుతుండటంతో పాదచారులు సైతం రైలు గేటు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నారు. విజయవాడ డివిజన్‌లో నాలుగో లైను ప్రభుత్వం మంజూరు చేసిందనే ప్రచారం జరగడంతో రైలు పట్టాలు దాటాలంటే ప్రజలకు మరింత అసౌకర్యం కలుగనుందనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలి

గేట్లు మూస్తే కలుగుతున్న అసౌకర్యానికి గురవుతున్న ప్రజలు రైల్వేలైనుకు అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. చినగంజాం, సోపిరాల, మున్నం వారిపాలెం రైల్వే గేటుల వద్ద అండర్ పాస్‌లు ఏర్పాటు చేస్తే ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలగి పోతాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రైల్వే అధికారులు అండర్ పాస్‌లు, ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని సర్వే చేయడం జరిగిందంటూ రైల్వే సిబ్బంది చెబుతున్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



కారంచేడులో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధుసూదన రెడ్డి

కారంచేడు: స్థానికంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రత్యేక కృషి చేద్దామని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదనరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి ఆయన మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలో పార్టీ కార్యకర్త జాగర్లమూడి ఆంజనేయులు ఇంటి వద్ద మండల పార్టీ నాయకులతో కొద్ది మాట్లాడారు. మండలంలో ప్రధానంగా ఉన్న ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని ఆయన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార దిశగా మనందరం కలిసి పనిచేద్దామన్నారు. పార్టీని వదలకుండా జెండాను మోసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన బాధ్యతను చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, మాజీ వైస్ ఎంపీపీ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, జాగర్లమూడి ఆంజనేయులు, తేళ్ళ చింపిరమ్మ, కొడాలి ధర్మానందరావు, చల్లా సుబ్బారెడ్డి, నూర్‌బాషా మీరావలి, సామేలు, పోతిన వాసు, వంకరాల సుందరరావు, షేక్ కాలేషా, నందపాటి సుబ్రమణ్యం, మొగిలి నాగేశ్వరరావు, ముతకన రాజేష్, కారంచేడు, పర్చూరు, మార్టూరు, ఇంకొల్లు మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం తీరనిలోటు



పర్చూరు బొమ్మల సెంటర్ వద్ద శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేస్తున్న సంఘస్తులు

అద్దంకి రూరల్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం క్రైస్తవ లోకానికి తీరని లోటని పాస్టర్ ఇటికాల యోహాన్ అన్నారు. ఆదివారం స్థానిక భిక్షాలు కాలనిలోని జేసీసీజీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రవీణ్ పడగాలకు కుటుంబానికి ప్రగాఢ సానుబూతిని తెలియజేస్తూ కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. సువార్తికులు ఎస్. అనిల్, ఆర్. చంటి, ఎం. నాగార్జున, డి. కొండలు, పి. కోటయ్య, సంఘస్తులు పాల్గొన్నారు.

పర్చూరులో శాంతి ర్యాలీ

పర్చూరు(చినగంజాం): క్రైస్తవ ప్రబోధకుడు పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి పట్ల ఆయనకు నివాళులర్పిస్తూ పర్చూరులో క్రైస్తవులు ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ నగర్ చర్చి, నాగులపాలెం, లూథరన్ చర్చిల నుంచి బొమ్మల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. మిస్టరీగా ఉన్న ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సేవా సమితి సభ్యులు వడ్డిముక్కల అబ్రహం, నలిగల కిషోర్, పర్చూరు, నాగులపాలెం లూథరన్ చర్చి పాస్టర్‌లు జోసెఫ్‌కేరి, చంద్రపాల్, నెహ్రూ నగర్ పాస్టర్ కిరణ్, తిమ్మరాజు పాలెం పాస్టర్ ఏ. వేలు, నలిగల నాని, ఎం. బెన్హర్, ఎం. బెంజిమన్ జూపూడి రోశయ్య, తెలగతోటి ఆదాం తదితరులు పాల్గొన్నారు

ఘనంగా ఉగాది వేడుకలు



చెన్నుపల్లి శివాలయంలో భక్తులకు హారతి ఇస్తున్న అర్చకుడు



అలంకరణలో కొత్తపాలెం, కోదండరామస్వామి



బల్లికురవలో పూజలందుకున్న వరసిద్ధి వినాయకుడు



అద్దంకి: అలంకరణలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి



చీరాల: ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం



చింతపల్లిపాడులో పంచాంగ చేస్తున్న అర్చకుడు

వేటపాలెం: వివిధ దేవస్థానాల్లో ఉగాది పర్వదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో తెలుగు వారి నూతన సంవత్సరం ఉగాది రోజున అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరి స్వామి వారిని దర్శించుకున్నారు. సాయం కాలం ఆలయ ప్రాంగణంలో పంచాగ శ్రవణం వినిపించారు. రావూరిపేటలో వేంచేసియున్న వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ధర్మవరపు వెంకట రమణ పంచాంగ శ్రవణం గావించారు. ఆణుమల్లిపేటలోని మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు పంచాంగ విశిష్టత శ్రవణం ఉగాది విశిష్టత గురించి వివరించారు. అర్చక స్వాములు అలహరి నరసింహశాస్త్రి, హనుమాన్ చార్యులు, పెద్దలు జివ్వాజి రంగనాథ గుప్తా దంపతులు, వల్లంపట్ల రామలింగ స్వామి దంపతులులను ఘనంగా సన్మానించారు.

బల్లికురవ: విశ్వావసు నామ సంవత్సరం ఉగాది వేడుకలు ఆదివారం మండలంలో నిర్వహించారు. చెన్నుపల్లి, కొత్తపాలెం, బల్లికురవ, ముక్తేశ్వరం అంబడిపూడి, కొణిదెనలోని ఆలయాలకు భక్తులు వెళ్లి స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీపి, వగరు, కారంతో తయారు చేసిన వేపపూత ప్రసాదాన్ని అర్చకులు పంపిణీ చేశారు. సాయంత్రం ఆయా ఆలయాల్లో పంచాంగ శ్రవణంతో రాశి నక్షత్రాలు, ఆదాయ వ్యయాలు, పండే పంటలు, వర్షాలు తెలియజేశారు.

అద్దంకి: తెలుగు వారి నూతన సంవత్సరం ఉగాది వేడుకలను నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉగాది, యుగాదిగా పిలువబడే తెలుగు సంవ్సరాది రోజున ప్రజలంతా ఉతయాన్నే నిద్ర లేచి తలంటు స్నానాలు చేశారు. కొత్తబట్టలు కట్టుకుని వేపపూతతో షడ్రుచులు కలిగిన ఉగాది పచ్చడి చేసి అందరికీ పంచిపెట్టారు. విశ్వావసు నామ సంవత్సరంలో పంటలు, తమ తమ రాశుల వారీగా ఫలాలు తెలుసుకున్నారు.

శింగరకొండలో..

ప్రముఖపుణ్యక్షేత్రమైన శింగరకొండ క్షేత్రాధిపతి నరసింహ స్వామి దేవస్థానంలో ఆదివారం ఉగాది సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, అలంకరణప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి, భక్తులు పాల్గొన్నారు.

యద్దనపూడి: విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం వేడుకలను ఆదివారం ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయాన్నే తమ లోగిళ్లను మామిడి తోరణాలతో అలంకరించుకొని ఇంటిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయాలకు వెళ్లి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం గావించారు.

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న శ్రీ మదనగోపాలస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉగాది పండుగ సందర్భంగా రుక్మిణి సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఉత్సవ మూర్తులను పట్టణంలో ఊరేగించారు. అర్చకులు ఆర్‌వీ రంగాచార్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలానే పట్టణంలోని వీరరాఘవస్వామి దేవాలయంలో ఉగాది సందర్భంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పట్టణంలో నగరోత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు దిట్టకవి వాసుదేవాచార్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి ప్రసాదాన్ని అందించారు. అలానే పేరాలలోని భద్రావతి సమేత భావనారుషి దేవాలయంలో, పేరాల శివాలయంలో ఉగాది పండుగ సందర్భంగా పంచాంగ శ్రవణం నిర్వహించారు.

కారంచేడు: తెలుసు సంవత్సరాది విశ్వావసునామ సంవత్సర ఉగాది పర్వదిన ప్రత్యేక పూజలు కన్నుల పండువగా నిర్వహించారు. ఆదివారం వేకువ జాము నుంచి ఆలయాలు భక్తులతో కిటికిటలాడాయి. కారంచేడు, స్వర్ణ, కుంకలమర్రు, దగ్గుబాడు, ఆదిపూడి గ్రామాల్లోని దేవాలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు చేశారు. కారంచేడు పెద్ద బజారు శివాలయం, మాధవస్వామి గుడి, వెంకటేశ్వర స్వామి గుడి, గంగమ్మగుడి, స్వర్ణ శివాలయం, వెంకటేశ్వరస్వామివారి ఆలయం, వల్లభరాయస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చినగంజాం: స్థానిక భావన్నారాయణ స్వామి ఆలయంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం భావన్నారాయణునికి శత అష్టోత్తర కలశ స్నపన తిరుమంజన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామికి విశేష అలంకరణ, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు.

అద్దంకి రూరల్: జానపద కళాక్షేత్రం ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది పురస్కరించుకుని జనశిక్షణ సంస్థాన్ కిన్నెర శ్యాం సునీల్‌కు ఆదివారం స్థానిక పద్మాలయ స్టూడియోలో పురస్కారాన్ని అందించారు. జానపదకళా పీఠం అధ్యక్షుడు యు. దేవపాలన శ్యాంసునీల్‌కు పురస్కారాన్ని అందజేసి సన్మానించారు. ధర్మవరపు నరసింహారావు,



చినగంజాం: భావన్నారాయణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న తిరుమంజన సేవ



వేటపాలెంలో వెంకటేశ్వర స్వామి దర్శినానికి బారుల తీరిన భక్తులు



కారంచేడులో గంగమ్మ గుడిలో ప్రత్యేక పూజల్లో భక్తులు

ద్విచక్రవాహనం ఢీకొని యువకుడికి గాయాలు

అద్దంకి రూరల్: రోడ్డు దాడుతున్న యువకుడిని బైకు ఢీ కొట్టడంతో గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి కలవకూరు రోడ్డు చోటుచేసుకుంది. మృతుడు పొట్టి శ్రీరాములు జిల్లా కోటపర్తి గ్రామం నుంచి వచ్చి అద్దంకి నుంచి కలవకూరు వెళ్లే రోడ్‌లోని ఇటుకబట్టీల్లో పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం బట్టీల వద్ద రోడ్డు దాటుతుండగా కలవకూరు వైపునుంచి వస్తున్న బైకు ఢీకొట్టింది. స్థానికులు 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు.. అనంతరం ఒంగోలు తరలించారు.

వైభవంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం



బొడ్డువానిపాలెంలో అభయాంజనేయస్వామి

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని బొడ్డువానిపాలెం గ్రామంలో గల అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారికి విశేష అభిషేకాలు, ఆకుపూజ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సందడిగా మారిన తీరం



వాడరేవు తీరంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

చీరాల టౌన్: మండల పరిధిలోని వాడరేవు సముద్ర తీరం ఆదివారం పర్యాటకులతో కోలాహలంగా మారింది. వరుసగా శెలవులు రావడం, ఇంటర్ పరీక్షలు పూర్తి కావడంతో స్వగ్రామాలకు వచ్చిన వారంతా వాడరేవు తీరానికి వచ్చి సరదాగా గడిపారు. వాడరేవు తీరానికి చీరాల, పర్చూరు, అద్దంకి, ప్రత్తిపాడు, గుంటూరు, చిలకలూరిపేట, నర్సరావుపేట ప్రాంతాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన పర్యాటకులు వాడరేవు చేరుకుని స్నానాలు ఆచరించి సందడి చేశారు. తీరం ఒడ్డున యువకులు, మహిళలు చిన్నారులు సేదతీరుతూ సముద్రపు మన్నుతో ఆటలాడుతూ కడలి చెంత సంతోషంగా గడిపారు.

ఎండల వేళ మంచు దుప్పటి



దట్టమైన మంచు కారణంగా ఉదయం ఆలస్యంగా నడుస్తున్న రైలు



చీరాల-బాపట్ల ప్రధాన రహదారిలో దట్టమైన మంచులో వాహనాలకు లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్న దృశ్యం

చీరాల టౌన్: ప్రస్తుతం భానుడు ఉగ్ర రూపం చూపిస్తున్నాడు. ఉదయం 10 గంటల నుంచే భానుడి తాపంతో ప్రజలు అల్లాడుతున్నారు. కానీ ఆదివారం మాత్రం చీరాల్లో విభిన్న వాతావరణం నెలకొంది. ఉదయం మంచు దుప్పటి కప్పింది. వాహనాలు సైతం నెమ్మదిగా లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. ఉదయం ఆరు గంటల నుంచి 9 గంటల వరకు మంచు దుప్పటి కమ్మేయగా 10 గంటల నుంచి భానుడి భగభగలతో సండే చూపించాడు. ఈ మధ్య కాలంలో ఇలాంటి విభిన్న వాతావరణం చూడలేదని ప్రజలంటున్నారు. వేసవి కాలంలో మంచుదుప్పటి కట్టడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పొగమంచు చీరాలను చుట్టేసింది. మంచుకారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దట్టమైన మంచు కురుస్తుండటంతో అటు వాహనదారులు, ఇటు సిగ్నళ్లు సక్రమంగా కనిపించకపోవడంతో ఉదయంపూట నడిచే రైళ్లు నెమ్మదిగా నడిచాయి.

నిరుపేదలకు రంజాన్ తోఫా



ఇంకొల్లు: పేద కుటుంబాలకు తోఫా అందజేస్తున్న ముస్లిం సోదరులు

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లు గ్రామంలోని 30 మంది నిరుపేద కుటుంబాలకు గ్రామానికి చెందిన షేక్ అలీ రంజాన్ తోఫాను అందజేశారు. 10 కేజీల బియ్యం,రెండు కేజీల బాస్మతి బియ్యం, కంది పప్పు, సన్ ఫ్లవర్ ఆయిల్, కేజీ గోధుమ పిండి, సేమ్యా, చింతపండు, కొబ్బరి, వేరుశనగ గుళ్ళు, సుమారు రూ. 2 వేలు విలువ చేసే 18 రకాల వస్తువులను అందజేసినట్లు ఆయన వివరించారు.

చిరు ఉద్యోగికి రూ. 20 వేలు వితరణ



వెంకట్రావుకు నగదు అందజేస్తున్న రోటరీ సభ్యులు

పర్చూరు(చినగంజాం): గత 16 ఏళ్ల నుంచి పర్చూరు రోటరీ గంగ వాటర్ ప్లాంట్‌లో పని చేసి అనారోగ్య కారణాల వలన ఉద్యోగ విరమణ చేసిన అందె వెంకట్రావుకు రూ. 20 వేలు నగదును బహూకరించారు. అతనికి మందుల ఖర్చుల నిమిత్తం పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సహాయం చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ తెలిపారు. క్లబ్ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు పంబి సదానందరెడ్డి, పాబోలు వెంకన్న,కోట శ్రీనివాసరావు, మున్నంగి వెంకట సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పావులూరులో ఇఫ్తార్ విందు



పావులూరులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలో ఆదివారం రాత్రి ముస్లిం సోదరులు ఇఫ్తార్ విందు నిర్వహించారు. గ్రామంలోని మసీదు వద్ద మత పెద్ద షేక్ సుభాని ప్రార్థనలు నిర్వహించగా ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఇఫ్తార్ విందును పులఖండం రామకృష్ణారెడ్డి నిధులు సమకూర్చగా ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. పులఖండం బద్రిరెడ్డి, మారెళ్ళ అజయ్, సింహాద్రి రాము, బ్రహ్మారెడ్డి, పావులూరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.